


# పరదేశీ కథలు

- చిట్టే సిద్ధ లలిత



– 130 –

## ఎడారి అంచుల్లో...

**భర్త అర్థాంతరంగా** పోవడంతో రాధ జీవితం ఒక విషాదగీతంలా మారింది. కోనసీమలోని గోదావరి తీరంలో, పచ్చని పొలాల మధ్య, కొబ్బరితోటల పక్కన ఉన్న ఆమె చిన్న పెంకుటిల్లు ఇప్పుడు భర్త లేక బోసిపోయింది. పిల్లల నవ్వులతో కళకళలాడిన ఆ ప్రాంగణం ఇప్పుడు మూగబోయింది.

వేకువ జామున కోడికూత, గుడిగంటల శబ్దం, పిల్లల అల్లరి తప్ప ఆమె జీవితంలో మరేమీ ఉండేది కాదు.

కానీ ఇప్పుడు పిల్లల బాధ్యత తన భుజాలపైన పడింది. తన పిల్లల భవిష్యత్తు కోసం ఆమె ఏదైనా చేయాలని నిర్ణయించుకుంది. అదే సమయంలో ఒక ఏజెంట్ తారసపడ్డాడు. చెప్పాలంటే ఏజంట్లు ఇలాంటి ఆడవాళ్ళ కోసమే వెతుకుతుంటారు. పిల్లల్ని అమ్మ దగ్గర వదిలి కువైట్ కు వెళ్ళేందుకు సిద్ధపడింది రాధ.

విమానం దిగి కువైట్ నేలపై అడుగుపెట్టినప్పుడు ఆమెకు కాస్త భయం కలిగింది.

కానీ కువైట్ లో వున్న ఎత్తైన భవనాలు, అందమైన రోడ్లు, ఆధునికమైన కార్లు చూసి ఇక్కడ ఆమె జీవితం మారబోతుందని ఆశ పడింది. కానీ ఆశలు నెరవేరడం అంత సులభం కాదు.

అక్కడి ఏజెంట్ ఆమెను షేక్ ఖాలిద్ ఇంట్లో పనికి కుదిర్చాడు.

ఖాలీద్ ఇల్లు నగరానికి దూరంగా, ఒక ఎడారి ప్రాంతంలో విసిరేసినట్లుగా ఉంది. ఆ ఇల్లు చూడటానికి ఒక భవనంలా కాకుండా, వైభవమంతా గతించిన ఒక పాత కోటలా అనిపించింది. లోపల పాత కాలపు శిల్పాలు, భారీ తలుపులు, పెద్ద కిటికీలు ఉన్నాయి. ఇంటి వెనుక పెద్ద ఖాళీ స్థలం, ఎండిన ఖర్జూరపు చెట్లు, గడ్డి మొక్కలు వాటవతల అలలతో ఉప్పొంగే అరేబియా సముద్రం కనిపించాయి.  సముద్రాన్ని చూసి ఆమెకు గోదావరిని చూసినంత సంతోషం కలిగింది.

ఖాలిద్ కు భార్య ముగ్గురు పిల్లలు వున్నారు. అక్కడ ముసలిదైన ఒక ఇతియోపియా పనిమనిషి వుంది. ఆమె ముక్కుతూ, మూలుగుతూ వంటపని చేసి పెడుతుంది.

చుట్టుకుపోయిన రింగుల జుట్టుతో స్ఫోటకం మచ్చలతో మంత్రగత్తెలా వున్న ఆమెను చూసి రాధకు భయమేసింది.

ముఖ్యంగా అరబిక్ భాష ఆమెకు రాదు కాబట్టి సైగలతో కాలం నడిచేది. సేటు తొందరగా భాష నేర్చుకోమని విసుక్కునేవాడు. ఆయన కఠినమైన వైఖరి రాధను భయపెట్టేది.

అవన్నీ ఒక ఎత్తు అయితే  రాత్రిపూట ఆ ఇంటి నుంచి భయంకరమైన శబ్దాలు, ఏడుపులు వినిపించేవి. అవేమిటో ఎక్కడినుండి వినిపిస్తున్నాయో తెలిసేది కాదు. రాత్రిపూట ఆ శబ్దాలకు నిద్రపట్టక భయంతో వణుకు వచ్చేది.

భగవంతుడా ఎందుకీ పరీక్ష ఏమిటిది అనుకుంటూ భారంగా కాలం గడిపేది. రాధకు ఆ ఇంట్లో ఏదో రహస్యం వున్నట్లు అనిపించింది. తెలుసుకోవాలనిపించింది కానీ ఎవరిని అడగాలో తెలియదు.

ఎంతో అందంగా ఊహించుకున్న కువైట్ జీవితం ఆమెకు ఒక పీడకలగా పరిణమించింది.

ఆ ఇంట్లో ఆమెకు కనీస సౌకర్యాలు లేవు. ఆమెను ఇతియోపియా మనిషి కుషీలా గదిలో వుండమన్నారు. అది చాలా చిన్న గది. ఒక పాత మంచం, దుప్పటి మాత్రమే రాధకు ఇచ్చారు. తప్పదనుకుంది రాధ.

తన పనిలో శ్రద్ధ పెట్టింది. మూడ్నెల్లు భారంగా గడిచాయి. రాధకు కాస్త అరబిక్ భాష వచ్చింది.

కొద్దిరోజులకు ఖాలిద్ ప్రవర్తన ఆమెకు అనుమానం కలిగించింది.

అతడు కుషీలా చేసి ఇచ్చే రొట్టెలు, కూరా ఒక గిన్నెలో పెట్టుకుని ప్రతిరోజూ నేల మాళిగలోకి వెళ్ళడం చూసింది. అతడు లేనప్పుడు కుషీలా వెళ్ళి వచ్చేది.

అలా రోజూ మధ్యాహ్నం పూట ఆ తంతు జరుగుతుండేది. నేల మాళిగలో ఎవరున్నారో అనే కుతూహలం రాధకు కలిగింది.

ఒకరోజు, ఆమె పని చేస్తున్నప్పుడు నేలమాళిగ గదికి తాళం వేసి ఉండడం చూసింది. ఆ గది నుంచి అప్పుడప్పుడు ఏవో శబ్దాలు వచ్చేవి. ఎడారి అంచుల్లో ఊరికి దూరంగా వున్న ఆ భవంతిలోని శబ్దాలు రాధకు భయం కలిగించేవి. ఆమె ఆ గది గురించి అడిగితే, షేక్ ఖాలీద్ కోపంతో "అది నా వ్యక్తిగతమైన వ్యవహారం. నీవు అక్కడికి వెళ్ళకూడదు, వెళ్ళావో నీ సంగతి చూస్తా" అని అరిచాడు.

ఆదుర్దా అణచుకోలేక కుషీలాను ఆ విషయం అడిగింది. కుషీలా కూడా "మన మాటలు వింటే సేటు ప్రాణం తీస్తాడు.నువ్వు నోరు మూసుకుని పడివుండు" అని కసిరింది.

కుషీలా కూడా షేక్ ఖాలిద్  కుట్రలో ఒక భాగమని, దుర్మార్గురాలని రాధకు అనిపించింది.

ఆ రహస్యాన్ని ఎలాగైనా చేధించాలనుకుంది రాధ.

ఒక రోజు అందరూ కువైట్ పట్టణంలో బంధువుల పెళ్ళికి వెళ్ళారు. ఇదే సమయం అనుకుంది రాధ.

గబగబా కింద నేల మాళిగను చేరుకుని లోనికి దారి కనపడుతుందని చుట్టూ చూసింది. ఒక చోట చిన్న కిటికీ తప్ప మరేమీ లేవు. కిటికీని చేరుకుని తొంగి చూసింది.

ఏదో దుర్గంధం గుప్పున కొట్టింది. లోపల నేలపై దుమ్ము పేరుకుని వుంది. లోపలనుండి మనుషుల అరుపులు, మూలుగులు వినిపించాయి. ధైర్యం చేసి "ఎవరు లోపల" అని అరిచింది రాధ.

కాళ్ళకు చేతులకు సంకెళ్ళతో వున్న ఒక ఆకారం పడుతూ లేస్తూ నడుచుకుంటూ కిటికీ వద్దకు వచ్చింది. ఎముకలు కనిపిస్తూ అతను ఎంతో దీనావస్థలో వున్నాడు.

రాధకు గుండె వేగంగా కొట్టుకుంది. ఆమె ధైర్యం చేసి, "ఎవరు మీరు? ఎందుకిలా కాలం గడుపుతున్నారు" అని ప్రశ్నించింది.

ఆ మనిషి భోరున ఏడ్చాడు. ఆ రోదన హృదయ విదారకంగా వుంది.

అతడు ఖాలీద్ కు స్వయానా తమ్ముడు. అతని పేరు ఫహద్. చిన్న కొడుకు ఫహద్ కు తండ్రి కువైట్ సిటీలో భవనాన్ని ఇచ్చి పెద్ద కొడుకు ఖాలిద్ కు ఎడారిలో వున్న పాత భవంతిని పంచి ఇచ్చాడు.

అప్పటి నుండీ ఖాలిద్ తండ్రి పైన తమ్ముని పైన ద్వేషాన్ని పెంచుకున్నాడు. తండ్రి కూడా జబ్బుతో చనిపోలేదని ఖాలిదే విషాన్నిచ్చి చంపేసాడని అరబ్ జనాలు చెప్పుకుంటారు.  ఖాలిద్ చాలా మొండివాడు, క్రూరుడు. అనుకున్నపని చేస్తాడు.

తమ్ముని సంతకాలు తీసుకుని అతడిని చంపేస్తే కువైట్ పట్టణంలో వున్న ఆస్తి తన స్వంతమవుతుందని భావించి తమ్ముడిని, అతడి భార్యను కిడ్నాప్ చేసి నేల మాళిగలోని రహస్య స్థావరంలో వుంచి సంతకాలు పెట్టమని వేధిస్తున్నాడు.

సంతకాలు పెట్టిన మరుక్షణం తమ ప్రాణాలు తీస్తాడని ఫహద్ కు తెలుసు.  అల్లా దయ తలిచి ఎవరో ఒకరు విడిపిస్తే ఏదో ఒకరోజు బయటపడతామనే ఆశ. అందుకే ఏళ్ళ తరబడి ప్రాణాలను కాపాడుకుంటూ వస్తున్నారు.

అందుకే రాధను చూడగానే...

"ఖాలిద్ చాలా దుర్మార్గుడని తమ్ముడి ఆస్తిని చేజిక్కించుకోవాలనే దుర్బుద్ధితో పేపర్లపైన సంతకాలు పెట్టమని గత ఐదేళ్ళుగా అతడిని అతడి భార్యను బంధించి ఎవరికీ తెలియకుండా నేలమాళిగలో వుంచి హింసిస్తున్నాడని" చెప్పాడు.

"తమ పిల్లలకు బంధువులకూ ఈ సంగతి తెలియదని అందుకే ఇలా మగ్గిపోతున్నామని ఈ దుర్భరస్థితి నుండి ఎలాగయినా తమను విడిపించమని" వేడుకున్నారు.

"తమను రక్షిస్తే సగం ఆస్తి రాధకు ఇస్తానని పిల్లలకు దూరంగా పనిమనిషిగా ఈ పరదేశంలో పడివుండే ఖర్మ వుండదని" ప్రాథేయపడ్డాడు.

పిడుచలు కట్టిన అతడి జుట్టు, చిరిగి పీలికలయిన అతని దుస్తులు, నెలల తరబడి స్నానం లేక మురికి కంపు కొడుతున్న ఆ మనిషిని, అతడి భార్యను చూసిన రాధకు భయమేసింది.

ఫహద్ భార్య కూడా భోరున విలపిస్తూ "నీ పిల్లలకు మేలు జరుగుతుంది. మమ్మల్ని రక్షించు" అని మొర పెట్టుకుంది.

సరే.. తప్పకుండా మీకు సహాయం చేస్తాను అని మాటిచ్చింది రాధ.

మరుసటి రోజు రాత్రి, కుషీలా గురక పెట్టి నిద్రపోతుండగా మెల్లగా పడకపైనుండి లేచింది. ఖాలీద్ ఇంటిలో అందరూ ఎవరి గదుల్లో వారు నిద్రపోయారని నిర్ధారణ చేసుకున్న తరువాత అందరి గదులకూ బయటనుండి గొళ్ళెం పెట్టింది. నేలమాళిగలోని ఆ గది దగ్గరికి వెళ్లింది. ఆమెకు లోపల నుంచి సహాయం కోసం అరిచే శబ్దం వినిపించింది. రాధకు గుండె వేగంగా కొట్టుకుంది. ఆమె లోపలికి ఎలా వెళ్ళాలి అతడిని ఎలా విడిపించాలి అని ఆలోచించింది. ఆ సమయంలో, ఆమెకు ఖాలీద్ గదిలో ఉన్న తాళం చెవుల గుత్తి గుర్తొచ్చింది. ఆమె ధైర్యం చేసి, ఖాలీద్ గదిలోకి వెళ్లి మెల్లగా తాళం చెవుల గుత్తిని తీసుకుంది.

ఆమెకు భయం వేసింది, కానీ దీనావస్థలో వున్న ఆ మనుషులను రక్షించాలన్న ఆలోచనతో ఆమె ముందుకు సాగింది. రాధ ఆ తాళం చెవుల గుత్తిని తీసుకొని, ఆ గది తాళం తీసింది. లోపల చాలా చీకటిగా, దుర్వాసనతో కూడిన గాలి ఉంది.

రాధ, ఫహద్ అతడి భార్య పారిపోవడానికి ప్లాన్ వేశారు. కానీ, దురదృష్ట వశాత్తూ ఆ రాత్రి సమయంలో కుషీలా వీరిని కనిపెట్టి గట్టిగా అరిచింది. షేక్ ఖాలిద్ నిద్రలోంచి లేచాడు.

గది బయట గొళ్ళెం వేయడంతో బయటికి రాలేక గింజుకుంటూ రాధనుద్దేశించి"నువ్వు ఏం చేస్తున్నావు?" అని గద్దించాడు.

రాధకు ఏం చేయాలో తెలియలేదు. వేగంగా బయటికి వచ్చి ఖాలిద్ వున్న ఆ గదికి గొళ్ళెం పెట్టి వెంటనే పోలీసులకు ఫోన్ చేసింది. .

ఫహద్ అతడి భార్య"ఖాలిద్ నువ్వు చాలా పెద్ద తప్పు చేసావు, ఆస్తి కాజేయాలని మమ్మల్ని బంధించి హింసించావు" అని ఆవేశంగా ఖాలీద్ ను తిట్టాడు.

ఖాలీద్ కిటికీ నుండి ఫహద్ ను చూసి అతడి మాటలు విని షాక్ అయ్యాడు. "కుషీలా వాళ్ళని పట్టుకో" అని కేకలేసాడు.

అంత శక్తి ఎలా వచ్చిందో ఫహద్ ఆవేశంగా కుషీలాను బయటికి తోసేశాడు.

తమ్ముడు ఫహద్ ఖాలిద్ కళ్ళెదుట పిశాచిలా కనిపించాడు.

ఇంతలో పోలీసులు అక్కడికి వచ్చి,

ఫహద్ దుస్థితిని చూసి చలించిపోయారు. మిస్సింగ్ కేస్ గా నమోదయి వెతుకుతున్న ఫహద్ కనిపించడం వారికి ఆనందాన్ని కలిగించింది. చేతులకు బేడీలు వేసి ఖాలీద్ ను అరెస్టు చేశారు.

రాధ తన కష్టాలను, ఆ ఇంట్లో జరిగిన దారుణాలను పోలీసులకు వివరించింది. ఫహద్ కూడా తన అన్న చేసిన మోసాలను, అన్యాయాలను పోలీసులకు వివరించి చెప్పాడు.

పోలీసులు ఖాలీద్ ను కోర్టులో హాజరు పరిచారు. జీవితఖైదుతో జైలుకు పంపించారు.

ఫహద్ కోలుకున్నాక "నువ్వు మా పాలిట దేవతవు, మాకు ప్రాణం పోసావు" అంటూ చెప్పినమాట ప్రకారం రాధకు పెద్ద మొత్తంలో కువైట్ దినారాలిచ్చి కృతజ్ఞతలు తెలిపాడు.

ఫహద్, ఆమెను సగౌరవంగా సత్కరించి భారతదేశానికి పంపించాడు.

రాధ ఇండియాలో దిగింది. ఈసారి ఆమె మనసులో భయంలేదు. ఆమెలో ధైర్యం, ఆత్మవిశ్వాసం హృదయం నిండా నిండి ఉన్నాయి. ఆమె తిరిగి వచ్చినందుకు, ఆమె తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు. రాధ తన పిల్లలతో వున్న ఊళ్ళోనే ఒక కొత్త జీవితాన్ని ప్రారంభించింది. ఆమె తన కష్టాలు, భయాలను పక్కన పెట్టి, ధైర్యంగా ముందుకు సాగింది. ఊళ్ళో అందరూ ఆమెకు చేకూరిన సంపదను చూసి "కువైట్ కు వెళ్ళి దినారాల మూటలు సంపాదించి అదృష్టవంతురాలయ్యింది" అని చెప్పుకుంటారు.

(మరోకథ వచ్చేనెల)

Post your comments